క్లుప్తంగా

కృష్ణదేవిపేట స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ మోహన్, నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి గురువారం ఉదయం సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నియమావళిని బాధ్యతగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎస్‌ఐ ఉపేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పార్టీ మారినట్టు ప్రకటించడం సిగ్గుచేటు'



మాట్లాడుతున్న ఎంపీటీసీ దేవి

బుచ్చెయ్యపేట: తాను వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరానని ప్రతిపక్ష పార్టీ నాయకులు పేపర్లో ప్రకటించడం సిగ్గు చేటని పొట్టిదొరపాలెం ఎంపీటీసీ సభ్యురాలు ఓడిగుండ దేవి విమర్శించారు. గురువారం తన స్వగ్రామం బుదిరెడ్డిపాలెంలో ఆమె మాట్లాడుతూ తమ కుటుంబం దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉందని, ఆ తర్వాత పరిణామాలతో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అడుగుజాడల్లో నడుచుకుంటున్నామన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తన గురించి ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు మెప్పు కోసం ఇలాంటి తప్పుడు ప్రకటనలివ్వడం మానుకోవాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, తైపురం సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, నాయకులు ఓడిగుండ గోవింద, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరిలో ఐక్యతను నెలకొల్పుతాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. దుడ్డుపాలెంలో నూతనంగా నిర్మించిన నూకాంబిక ఆలయం ప్రారంభోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మశ్రీకి ఆలయ కమిటీ ఘనంగా స్వాగతం పలికింది. పండితుల మంత్రోచ్చరణ మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో దేవతామూర్తుల ఆలయాల నిర్మాణం చేయడం వల్ల ప్రజలందరికీ ఎంతో మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త జి. సుధాకర్, సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, నాయకుడు శ్రీరామ్మూర్తి మాస్టారు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 25 మంది ఎంపిక



కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక వారితో వైద్య సిబ్బంది

దేవరాపల్లి: ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక కుమ్మరివీధిలోని ఉషోదయ స్కూల్‌లో ఈ శిబిరం నిర్వహించారు. 47 మందికి శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ జాక్సన్, సిబ్బంది తన్వి తదితరులు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 25 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ సిహెచ్. అశ్వనికుమార్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అగచాట్లు

టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వాకంతో పింఛన్‌దారులకు అగచాట్లు తప్పడం లేదు. రెండో రోజు గురువారం గంటల కొద్దీ క్యూలో ఉండలేక అవస్థలు పడ్డారు. ఉదయం 8 గంటలకే గ్రామ సచివాలయాలకు చేరుకోవడంతో కొన్నిచోట్ల తోపులాట నెలకొంది. దాంతో ఒక్కసారిగా పాత కష్టాలను గుర్తుచేసుకుని పలువురు బావురుమన్నారు. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్లు ఇస్తే మీకెందుకు కడుపు మంట అని టీడీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెరసి అష్టకష్టాలు పడి పింఛన్ సొమ్ము అందుకున్నా..వారిలో ఏ మాత్రం ఆనందం కనిపించకపోవడం గమనార్హం.

- చంద్రబాబు నిర్వాకంతో ఇక్కట్లు
- అధికార యంత్రాంగం చర్యలతో పంపిణీ వేగవంతం
- సచివాలయాల్లో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



బుచ్చెయ్యపేట: వడ్డాది సచివాలయంలో పింఛన్ల సొమ్ము ఇస్తున్న అధికారులు



రావికమతం: కొత్తకోట సచివాలయంలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు, దివ్యాంగులు



బుచ్చెయ్యపేట: పింఛన్ కోసం ఆటోలో సచివాలయానికి వచ్చిన వృద్ధుడు

రావికమతం: కొత్తకోటలో రెండు వేల వరకూ పింఛన్‌దారులు ఉదయం 8 గంటలకే సచివాలయాలకు చేరుకున్నారు. గంటల కొద్దీ తర్వాత పింఛన్ అందుకుని ఆపై ఎండలో నడిచి వెళ్తూ యాసపడుతూ ఇళ్లకు చేరుకున్నారు. ఇప్పటి వరకూ ఇంటికే చక్కగా వలంటీర్లు వచ్చి చిరునవ్వుతో అందించేవారని, తమకేటీ ఈ నరక యాతన అంటూ దీనికి కారణమైన పచ్చముఠాను చీవాట్లు పెట్టారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని 35 పంచాయతీ కార్యాలయాల్లో వృద్ధులు, దివ్యాంగులు ఎండలో అవస్థలు పడి పింఛన్ నగదు పొందారు. పలువురు ఆటోలు, ద్విచక్ర వాహనాల సహాయంతో వచ్చారు. మండలంలో 10,805 పింఛన్లకుగాను 90 శాతం వరకు పంపిణీ చేశామని, మిగిలిన లబ్ధిదారులకు ఇంటింటికి తిరిగి అందిస్తామని ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు.

84 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి

మాడుగుల రూరల్: గ్రామ సచివాలయాల ఆవరణలో టెంట్లు వేసి, తాగునీటి సౌకర్యం కల్పించారు. పూర్తిగా నడవలేని వారు, మంచంపై ఉన్నవారు, దివ్యాంగులు, తదితర అనారోగ్య బాధితుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మండలంలో 84.41 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. నియోజకవర్గంలో చీడికాడ మండలంలో 8,845 మందికిగాను 6,966 మందికి, దేవరాపల్లి మండలంలో 10,439 మందికిగాను 7,821 మందికి, కె. కోటపాడు మండలంలో 11,102 మందికిగాను 6,235 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయా మండలాల అధికారులు పేర్కొన్నారు.

దేవరాపల్లి/చీడికాడ: మండల వ్యాప్తంగా అవ్వాతాతలకు అగచాట్లు తప్ప లేదు. దేవరాపల్లి సచివాలయంలో ఉదయం 11గంటల వరకు నిరీక్షించాల్సి వచ్చింది. చీడికాడ మండలంలో ఎండకు భయపడి కోనాం శివారు 14 గ్రామాల వారు, వి.బి.పేట, మంచాల, చీడికాడ శివారు గ్రామాల గిరిజనులు మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు దూరం నడిచి ఉదయం 8 గంటలకే ఆయా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అధికారులు వారికే మొదటి పింఛన్లు అందించి పంపించారు.



చీడికాడ: వి.బి.పేట కార్యాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న గిరిజనులు

ఇంటికొచ్చి పింఛన్ ఇప్పించండి మహాప్రభో...



నాకు కీళ్ల నొప్పులు.. అడుగు తీసి అడుగు వేయాలేకపోతున్నా. ఎండలో కిలోమీటరు దూరం రావాల్సి వచ్చింది. ఎండకు సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితి కనిపించింది. గతంలో మాదిరి ఇంటికే పంపిస్తే బాగుంటుంది. నాకే ఇలా ఉంటే మా అమ్మ అచ్చియ్యమ్మ (82) మంచంపై ఉంది. నడవ లేదు. ఆమెకు పింఛన్ డబ్బులే ఆధారం. మందులు కొనుక్కోవాలి. దయచేసి ఎప్పటిలా ఇంటికి వచ్చి పింఛన్ ఇప్పించండి.

– గుడివాడ రమణ, కొత్తకోట, రావికమతం మండలం

టీడీపీ నేతల ఫిర్యాదు దుర్మార్గం



నేను దివ్యాంగుడిని, తాపీమేస్త్రి వద్ద సహాయకుడిగా పని చేస్తున్నా. ప్రతి నెలా వలంటీర్ ఫస్ట్ తేదీనే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవాడు. రాజకీయ కక్షతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదు చేసి వారిని దూరం చేయడం దుర్మార్గం. ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వాలి.

– కొండపల్లి అర్జున్, దివ్యాంగుడు, కొండపాలెం గ్రామం, రోలుగుంట మండలం

పింఛన్ కోసం వెళ్లలేని పరిస్థితి

నేను పూర్తిగా అనారోగ్యానికి గురై మంచాన పడ్డాను. నాకు ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీరు మా ఇంటికి వచ్చి పింఛను అందజేసేవారు. వలంటీర్లను పింఛను పంపిణీ నుంచి తప్పించడంతో నేను సచివాలయానికి వెళ్లలేని స్థితిలో ఉన్నాను. దాంతో సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి పింఛను అందజేశారు.

– బుద్దా రామారావు, పింఛనుదారుడు, కె.జె.పురం, మాడుగుల మండలం

పోస్టల్ బ్యాలెట్‌పై సమగ్ర అవగాహన

- రిటర్నింగ్ అధికారి జయరాం



పోస్టల్ బ్యాలెట్ టీమ్‌తో సమావేశమైన ఆర్‌వో జయరాం

నర్సీపట్నం: ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్లను అర్హులంతా సకాలంలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం సూచించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ విధానంపై సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసే విధానం, ఓటర్లు వినియోగించుకోవాల్సిన తీరుపై ఆయన పోస్టల్ బ్యాలెట్ బృందానికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

రోలుగుంట: వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో జాన్ లింకన్ తెలిపారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ మండల సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా హౌసింగ్ ఏఈ పేమానందం, పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సూర్యామణి, వెలుగు ఏపీఎం సాధన ఆయా శాఖల వారీగా చేసిన అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఎంపీటీసీలు గొర్లె వెంకట రామన్, వడ్డాది సతీష్ తదితరులు ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ, మజ్జిగ, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దు

- కార్యకర్తల సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి అనురాధ



అసెంబ్లీ అభ్యర్థి అనురాధను సత్కరిస్తున్న సత్యవరం మహిళలు



శంకరంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ

మాడుగుల: కూటమి అభ్యర్థుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికల తర్వాత ఇక్కడ కనిపించని వారికి తగిన బుద్ధి చెప్పాలని, మరలా రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. గురువారం శంకరం పంచాయతీలో సర్పంచ్ శొలం రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎన్ని గ్రామాలున్నాయో తెలియని వ్యక్తి సీఎం రమేష్ డబ్బుతో ఓట్లు కొనడానికి ఇక్కడ ప్రజలు అమాయకులు కాదన్నారు. ఇప్పటికే స్థానికేతరులను ఓడించారని, ఇప్పుడు గతి సీఎం రమేష్‌కు తప్పదని హెచ్చరించారు. టీడీపీ హయాంలో మాడుగుల నియోజకవర్గం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా మారిందో అందరికీ తెలిసిందేనన్నారు. శంకరం, తాటిపర్తి, ఎం. కోడూరు, డి.గొటివాడ, సత్యవరం, జంపెన, మాడుగుల, సాగరం, ఎం.కె.వల్లాపురం, ఎం. కోటపాడు, వంటర్లపాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని చైతన్యవంతం చేశారు. ఇంత వరకు మాడుగుల కోటపై ఇద్దరు మహిళలు మాత్రమే విజయం సాధించారని, మరలా మూడో మహిళగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు మాట్లాడారు. నిరుపేదలను ఆదుకున్న జగన్‌ను మరలా సీఎం చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అంతకు ముందు ప్రతి గ్రామాల్లో జై జగన్, జై బూడి, జై అనురాధ అంటూ నినాదాలతో హోరెత్తారు. మహిళలు అనురాధకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. మాడుగుల పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎడ్ల కళావతి, అల్లంగి గౌరీ సంజీవరావు, గొల్లవిల్లి సంజీవరావు, కోట్ని జయమ్మ, నేమాల గురువునాయుడు, గోకేడ అర్జునరావు, కోట్ని లక్ష్మి, ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము, మాజీ సర్పంచ్ కోట్ని శ్రీరామూర్తి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, తలారి అప్పారావు, శ్రీనాథు సూర్యకాంతం, దాడి నూకరత్నం, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, నాయకులు పడాల అప్పలనాయుడు, శ్రీనాథు జగ్గారావు, గోకేడ అప్పలనాయుడు, శనివాడ వెంకట రమణ, జనపరెడ్డి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థికే యాదవుల మద్దతు

- బూడి ముత్యాలనాయుడిని కలిసిన యాదవ నాయకులు



ముత్యాలనాయుడును సత్కరిస్తున్న యాదవ సామాజిక వర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అనకాపల్లి నియోజకవర్గం యాదవ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. గురువారం తారువలో ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడును వారంతా కలిసి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనకాపల్లి జిల్లా పట్ల పరిపూర్ణ అవగాహన కలిగిన, స్థానికుడైన ముత్యాలనాయుడికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకు అంకితమైన వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు జిల్లా వ్యాప్తంగా యాదవులను కలిసి ప్రచారం చేస్తామన్నారు. బూడిని కలిసిన వారిలో తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మొల్లి అప్పారావు, అగ్రికల్చర్ బోర్డు వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, పల్లా ప్రసాద్, మొల్లి నాగు, కొయ్య భాస్కర్, రాయిబోయిన ఈశ్వరరావు, శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఉన్నారు.

టీడీపీ నుంచి మూడు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

- సాదరంగా ఆహ్వానించిన అసెంబ్లీ అభ్యర్థి అనురాధ



పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి అనురాధ

మాడుగుల: డి.గొటివాడకు చెందిన మూడు కుటుంబాలు టీడీపీని వీడిని వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి గురువారం సాయంత్రం ఎం. కోటపాడులో అసెంబ్లీ అభ్యర్థి అనురాధ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన సీరా జగన్నాథరావు, గెమ్మిల జగన్నాథరావు గెమ్మిల శ్రీను మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై తాము పార్టీలో చేరామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు రానున్న కాలంలో పార్టీ నుంచి మంచి గుర్తింపు వస్తుందన్నారు. నాయకుడు గోకేడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, నాయకులు కరణం త్రినాథరావు, సీకిరి శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే పట్టం కట్టండి



రేవళ్లులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన పట్టణ ప్రజలు



ప్రచారంలో పాల్గొన్న మహిళలు, యువకులు

చోడవరం: ఎన్నిక ప్రచారంలో భాగంగా తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి జన నీరాజనం పట్టారు. నీ వెంటే మేమున్నామంటూ అడుగులో అడుగేసి ప్రచారంలో కదం తొక్కారు. చోడవరం పంచాయతీ పరిధిలో రేవళ్లు, అంబేడ్కర్ కాలనీ, రెల్లివీధి, యాతపేట ప్రాంతాల్లో ఎమ్మెల్యే ధర్మశ్రీ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున యువకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ప్రతీ కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన ప్రభుత్వం తమదే అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఇబ్బందులు పడకుండా నేరుగా వలంటీర్ల ద్వారా అందిస్తూ, కార్యాలయాల చుట్టూ తిరగకుండా పథకాలన్నీ ఇంటికే వచ్చేట్టు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్ల వలంటీర్ల ద్వారా ఈ నెల పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. ఇలాంటి ఇబ్బందులు పెట్టి ప్రజల జీవితాలతో ఆడుకోవడం టీడీపీ నాయకులు అలవాటేనని ధ్వజమెత్తారు.

ఎన్నోయేళ్లుగా చోడవరం పట్టణంలో తీవ్ర మంచి నీటి సమస్య ఉండేదని, రూ.14 కోట్లు ఖర్చు చేసి మినీ మంచినీటి రిజర్వాయరు కట్టి ఇంటింటి కుళాయి నీరు ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఎంపీటీసీ సూర్యనారాయణ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి సత్య, పందిరి శ్రీనువాసరావు, వార్డు మెంబర్లు గూనూరు రాజు, మహిళా అధ్యక్షురాలు యర్రా దేవి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆఫీస్ అసిస్టెంట్ సస్పెన్షన్

రోలుగుంట: స్థానిక పీఏసీఎస్‌లో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్ పిల్లా నూకరాజు గత నెల 31న ఓ రాజకీయ సమావేశంలో పాల్గొన్నారని అభియోగం మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొవ్వూరుకు చెందిన బంటు రాజు జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపారాణికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె సదరు ఉద్యోగి నుంచి ఆ రోజే వివరణ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు యలమంచిలి డివిజన్ సహకార కార్యాలయాధికారి కిరణ్‌కుమారి గురువారం నూకరాజు అందజేశారు.

ఉదయం పది వరకే 'ఉపాధి'

మాకవరపాలెం: అధిక ఎండల నేపథ్యంలో ఉదయం 10 గంటల వరకే ఉపాధి పనులు నిర్వహించాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. కొండలఅగ్రహారంలో పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కావడంతో కూలీలు పది గంటలతో పని ముగించాలని తెలిపారు.

నాతవరం: ఉపాధి కూలీలంతా ఈ నెల నుంచి రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనులు చేయాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. గన్నవరం, శృంగవరం, మన్యపురట్ల, నాతవరం గ్రామాల్లో ఉపాధి పనులను గురువారం ఆయన తనిఖీలు చేశారు. మస్టర్లను పరిశీలించి వీఆర్పీలకు పనులు సూచనలు చేశారు. పని ప్రదేశాల్లో తాగునీరు, వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. పెంచి వేతనం విషయాన్ని కూలీలకు వివరించాలన్నారు. జిల్లాలో అధికంగా కూలీలు నాతవరం మండలంలోనే పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీ వీడినవారు టీడీపీ నాయకులే..



బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలో వైఎస్సార్ సీపీని వీడి ఇతర పార్టీలో ఎవరూ చేరలేదని పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తెలిపారు. గురువారం బుచ్చెయ్యపేటలో వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నుంచి రెండు వేల మంది టీడీపీలో చేరినట్టు ప్రకటనలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు వెళ్లిన టీడీపీ నాయకులెవరు 2019 ఎన్నికల్లో తమ పార్టీలో లేరన్నారు. ఆ రోజే బుచ్చెయ్యపేట మండలంలో 8 వేలు, చోడవరం నియోజకవర్గంలో 28 వేలకుపైగానే మెజార్టీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది టీడీపీ నాయకులు వారి ఆస్తులు కాపాడుకోవడానికి ఎమ్మెల్యే పక్కన చేరారన్నారు. ఇటువంటి అవకాశవాదులు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ప్రకటినలిస్తున్నారని విమర్శించారు. కొంత మంది బడాబాబుల రాజకీయ స్వార్థం కోసం కింద స్థాయి కార్యకర్తలను పార్టీలు మారేలా ఒత్తిళ్లు చేసి వారి రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. అలాంటి కార్యకర్తలే ఊసరవెల్లి నాయకులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పుడు వెళ్లిన నాయకుల గురించి తెలిసి టీడీపీ నాయకులే వారిని పార్టీలో చేర్చుకోకుండా అడ్డుకున్నారన్నారు. ఎవరి రాజకీయాలు వారు చేసుకుంటే మంచిదని, వ్యక్తిగత దూషణలకు దిగితే బాగుండదని, రెండోసారి ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మండల సచివాలయ కన్వీనర్ కె. అప్పలనాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు సాయం రమేష్, కోవెల ఈశ్వరరావు, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు, సర్పంచ్‌లు పినపోలు రామునాయుడు, గోపిశెట్టి శ్రీను, బాబూరావు, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి గుడాల ఆనంద్, నాయకులు ముసలినాయుడు, రమణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

టీడీపీ వస్తే సంక్షేమ పథకాలు బంద్



కేపీ అగ్రహారంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ, నాయకులు

బుచ్చెయ్యపేట: టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ నిలిపేస్తుందని జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు హెచ్చరించారు. గురువారం కేపీ అగ్రహారంలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికొచ్చి ఇవ్వాల్సిన పింఛన్‌ను టీడీపీ నాయకులు ఆపేశారని విమర్శించారు. ఈ క్రమంలో మరలా తమకు పింఛన్ కష్టాలు మొదలయ్యాయని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ఆపేస్తే పేదలు తీవ్రంగా నష్టపోయి అవస్థలు పడతారని తెలిపారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ కె. అప్పలనాయుడు, వైస్ సర్పంచ్ ముసలినాయుడు, సచివాలయ కన్వీనర్ రమణ, నాయకులు జి. నూకరాజు, వి. రమణ, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సూర్యనారాయణ

కె.కోటపాడు: వేసవి దృష్ట్యా మాడుగుల సబ్ డివిజన్ పరిధి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ తెలిపారు. గురువారం కె.కోటపాడులో ఆయన మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గంలో 111 గ్రామ పంచాయతీల్లో 3,800 మంచినీటి బోర్లు, 293 మంచినీటి పథకాలు పని చేస్తున్నట్లు వివరించారు. వీటిలో మరమ్మతులకు గురైన వాటికి ఇప్పటికే బాగు చేశామన్నారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.178 కోట్లతో చేపట్టిన మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిల పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయన్నారు. ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించినట్లు పేర్కొన్నారు. మిగిలిన పనులు త్వరలోనే పూర్తయ్యి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మంచినీటి పథకాలు, బోర్లు మరమ్మతులకు గురైతే 9533193917 ఫిర్యాదు చేయాలన్నారు.